# పరిచయం

# హోషేయ

దేవుని ప్రజలు తన యెదుట నమ్మకముగా జీవించాలన్న దేవుని కోరికను హోషేయ గ్రంథము తెలియజేస్తుంది. ఇశ్రాయేలీయులు చెదిరిపోయిన తరువాత దేవుడు వారి పట్ల చూపించిన దయ, కృపను గురించి ఇది వివరిస్తుంది. దేవుడు తన ప్రజలతో చేసిన నిబంధన ప్రకారం వారు జీవించేలా వారికి ఆయన ఎన్నో అవకాశాలను ఇచ్చాడు.

### విభజన, గ్రంథకర్త మరియు ప్రదేశము

చిన్న ప్రవక్తల గ్రంథాల్లో హోషేయ గ్రంథం మొదటిది మరియు పెద్దది. ఈ గ్రంథం దాని గ్రంథ కర్తయైన ప్రవక్త హోషేయ పేరుతో పిలువబడింది. ఈ పేరుకు "రక్షణ" లేదా "దేవుడే రక్షణ" అని అర్థం. "హోషేయ" అన్న పదం "యెహోషువా" అన్న మూలపదమునకు సంబంధించినది. "యెహోషువా" అన్న పదం "యేసు" గ్రీకు పదమునకు హెబ్రీ పదరూపము. ఆ విధంగా హోషేయ అన్న పేరు యేసు అనే పేరువంటిది. ఇతడు "బెయేరి" కుమారుడు (1:1). ఇతడు ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలులో జీవించి అక్కడే ప్రవచించాడు (గ్రంథంలోని ప్రదేశాల పేర్లను బట్టి) ఆతడు "ఇశ్రాయేలు," "ఎఫ్రాయిము," "సమరయ" అని ప్రవచిస్తున్నాడు. అలాగే హోషేయ దాదాపు పద్నాలుగు సార్లు యూదా రాజ్యమును గురించి కూడ ప్రవచించాడు.

### చారిత్రక సన్నివేశాలు

హోషేయ యొక్క పని విభజన రాజ్యపు చివరి కాలంలో అనగా క్రీ.పూ. ఎనిమిదో శతాబ్దములో జరిగినట్లు కనబడుతుంది. హోషేయ 1:1 ప్రకారం అతడు యరొబాము II అనే ఇశ్రాయేలు రాజు (క్రీ.పూ. 793–753) కాలంలోను మరియు యూదా రాజులైన ఉజ్జియా (క్రీ.పూ. 792–740), యోతాము (క్రీ.పూ. 750–732), ఆహాజు (క్రీ.పూ. 735–715) మరియు హిజ్కియా (క్రీ.పూ. 715–686) అనువారి కాలంలోనూ ప్రవచించినట్లు కనబడుతుంది.[1]

హోషేయ కాలంలోనే ఆమోసు ఉత్తర రాజ్యంలో ప్రవచించగా, యెషయా మరియు మీకా దక్షిణ రాజ్యంలో ప్రవచించారు. కాబట్టి అతడు ఇశ్రాయేలు రాజ్యపు సంధ్య సమయంలో ప్రవచించాడు.

రాజైన సొలొమోను కాలం తరువాత ఇశ్రాయేలు రాజ్యం క్రీ.పూ. 930లో రెహబాము కాలంలో రెండుగా విడిపోయింది. పది గోత్రాలవారు యరొబామును తమ రాజుగా నియమించుకున్నారు. రెండు రాజ్యాలైన ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యాలు ప్రక్క ప్రక్కన రెండు సంవత్సరాలు విడి విడిగా ఉన్నాయి. తరువాత ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలు రాజ్యం జయించబడి క్రీ.పూ. 722లో అష్షూరీయుల చేత చెరపట్టబడింది. వారెన్నడూ చెరనుండి తిరిగి రాలేదు. అదే సమయంలో దక్షిణ రాజ్యమైన యూదా రాజ్యం కూడ చెరపెట్టబడాల్సింది కానీ అది దేవుని చేత రక్షింపబడింది (చూడండి 1:6, 7). క్రీ.పూ. 740 నుండి ఇశ్రాయేలు

దేశపు క్షీణత లక్షణాలు కనబడ్డాయి. హోషేయ కాలంలో ఉత్తర రాజ్యంగా బలంగా ఉండి భద్రంగా ఉన్నట్లుండినది (చూడండి 8:14; 10:1, 13; 12:8).

## సందేశము

హోషేయ చెప్పుతున్న ప్రధాన సందేశం *అవిశ్వాసురాలైన ఇశ్రాయేలుపట్ల దేవుని ప్రేమ* హోషేయ యొక్క జీవితాన్ని ఒక దృష్టాంతముగా ఉంచి దేవుడు ఇశ్రాయేలునకు ఈ సందేశాన్నిస్తున్నాడు. దేవుని ఆజ్ఞానుసారం, హోషేయ "గొమేరు" అను ఒక వేశ్యను వివాహమాడాడు (1:2). ఇశ్రాయేలునకు ఇచ్చు సందేశమునకు సూచనగా అతడు తన ముగ్గురు పిల్లలకు పేర్లు పెట్టాడు: రక్త దోష లోయయైన యెజ్రెయేలును బట్టి ఒక కుమారునికి యెజ్రయేలు అని, ఒక కుమార్తెకు "జాలినొందనిది" అని, మరో కుమారునికి "మీరు నా జనులు కారు" అని పేర్లు పెట్టాడు (1:3–9). గొమేరు వ్యభిచారి కాగా, తిరిగి తన భార్యను చేర్చుకోమని దేవుడు హోషేయకు చెప్పాడు (3:1–5). హోషేయ గొమేరు పట్ల చూపించిన ప్రేమ విశ్వాసఘాతుకురాలైన ఇశ్రాయేలు పట్ల దేవుడు చూపించిన ప్రేమ వంటిది.

ఈ గ్రంథంలో ఎన్నో ప్రధాన విషయాలున్నాయి. (1) దేవుని ఆజ్ఞను లేదా మాటను వినడానికి ఇశ్రాయేలు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించింది. "నా జనులు జ్ఞానము లేనివారై నశించుచున్నారు ..." (4:6). (2) ఇశ్రాయేలు దేవునికి, మానవునికి వ్యతిరేకంగా పాపం చేసింది. ప్రజలు వ్యభిచారమనే దోషంతో వాడుకగా తమ తోటివారి యెడల అబద్ధమాడడం, హత్య చేయడం, దొంగిలించడం, వ్యభిచారించడం, త్రాగడం, దురాశను చూపించడం, మోసపర్చడం, దయచూపించక పోవడం వంటి ఎన్నో పాపాలను చేశారు. వారి నాయకులు కూడ పాపం చేశారు. (3) వారు దేవుని మీద కాకుండా, ఇతరుల మీద పాపయుక్తంగా ఆధారపడ్డారు. వారు అన్యదేశాలతో ప్రత్యేకించి అష్షూరు దేశంలో ఒప్పందాలు చేసుకున్నారు. వారు తమ ఆయుధాలు, కోటలను నమ్ముకున్నారు. దాని ఫలితంగా నాశనాన్ని చవిచూశారు. (4) దేవుడు వారిని ప్రేమించాడు కాబట్టి వారిని నాశనం చేయదల్చలేదు. ఇశ్రాయేలు దేవుని వైపు తిరిగి యుంటే ఆయన ఇశ్రాయేలును పునరుద్ధరించేవాడు.

## ముఖ్యమైన ప్రశ్నలు

వ్యాఖ్యాతలు రెండు ప్రశ్నల గురించి ప్రధానంగా ఆసక్తి చూపుతారు.

ఈ గ్రంథంలోని ప్రధానమైన ప్రశ్న ఏమిటంటే హోషేయ మరియు అతడి భార్యయైన గోమెరు యొక్క వృత్తాంతం చారిత్రాత్మకంగా నిజమైనదేనా లేదా ఒక ఉపమానమా అన్నది. అది చరిత్రలో జరిగిందే అయితే, ఏం జరిగింది? దేవుడు మొదట హోషేయతో మాట్లాడి నీవు గోమెరు వ్యభిచార వృత్తిలో ఉందా? లేక తరువాత వ్యభిచారియైందా? హోషేయ గోమెరును తన భార్యగా స్వీకరించినప్పుడా? 1 మరియు 3 ఆధ్యాయాలు రెండు విభిన్న సమయాలను సూచిస్తున్నాయా?

హోషేయ యొక్క వృత్తాంతం నిజంగా జరిగినట్లేయుంది కాబట్టి హోషేయ మరియు గోమెరు యొక్క వివాహం కూడ నిజంగానే జరిగియుంటుందని చెప్పాలి.[2] అంతకాకుండా, హోషేయ ఒక వేశ్యను పెండ్లాడడం ద్వారా ఏ ధర్మశాస్త్ర విధియూ అతిక్రమించబడలేదు కాబట్టి హోషేయ వివాహమాడు సమయానికి గోమెరు ఒక వేశ్య అని, తరువాత అతని

విడిచిపెట్టగా, (దేవుని మాట ప్రకారం) అతడామెను తిరిగి తెచ్చుకున్నాడు.

రెండవ ప్రశ్న గోమెరు నిజంగా వేశ్యయా కాదా అన్నది. హోషేయ గోమెరును వివాహమాడేందుకు ఆజ్ఞాపించబడినప్పుడు ఆమె వ్యభిచార వృత్తిలో ఉన్న విషయమై కొంతమంది సందేహిస్తుంటారు. అటువంటి వివాహ బంధం ఇశ్రాయేలుతో దేవుని బంధాన్ని చూపించడం లేదని ఎందుకంటే దేవుడామెను "వివాహం" చేసుకున్నప్పుడు ఇశ్రాయేలు పరిశుద్ధంగా పవిత్రంగా ఉందని వారు నమ్ముతుంటారు. ఇందులోని పరిష్కారం ఏమంటే దేవుడిచ్చిన దృష్టాంతంలో రెండు బంధాల మధ్య విషయాలు సరిగ్గా ఒకదాని కొకటి సరిపోలియుండాల్సిన అవసరం లేదు. మరో పరిష్కారం ఏమంటే, దేవుడు ఇశ్రాయేలును వివాహమాడినప్పుడు అనగా నిబంధన చేసుకున్న సమయంలో (నిర్గమకాండము 19) ఇశ్రాయేలు దేవుని నుండి తిరిగి పోయి, ఎన్నోమార్లు పాపం చేసింది. ఇశ్రాయేలీయులు దేవునితో నిబంధన చేసుకున్న వెంటనే వారు బంగారు దూడను ఆరాధించడం ద్వారా దేవునికి నమ్మక ద్రోహం చేశారు (నిర్గమకాండము 32). దేవుడు ఇశ్రాయేలును విడిపించినది ఆమె యొక్క నీతి ద్వారా ఏ మాత్రం కాదని దేవుడు స్పష్టం చేశాడు (ఉదహరణకు చూడండి ద్వితీయోపదేశకాండము 9:4).

## లక్షణాలు

హోషేయ యొక్క రచనా శైలిలో రెండు లక్షణాలు గుర్తించ దగ్గవి. ఈ గ్రంథంలో ప్రవక్త అలంకార భాషను విస్తారంగా వాడాడు. అలాగే, ఎన్నో చారిత్రక సంఘటనలను ఉదహరించాడు.

### అలంకార బాష

హోషేయ అలంకార భాషను విరివిగా ఉపయోగించాడు. ఉదాహరణకు, ఇశ్రాయేలును సూచిస్తూ ఎన్నో పోలికలు చేశాడు. *భార్యగా,* ఇశ్రాయేలు అపనమ్మకంగా ఉండినది. కుమారునిగా, ఆ దేశం కృతజ్ఞత లేకుండగా తిరుగుబాటు చేసింది. అలాగే దేవుని ఉపదేశాన్ని వినని ఇశ్రాయేలీయులు *"మొండి పెయ్యతో"* పోల్చబడ్డారు (4:16); ఇతర దేశాలతో కలుసుకోవడం వలన *"త్రిప్పివేయని అప్పముగా"* పోల్చబడింది (7:8), తన సంకటములను ఎరుగని వృద్ధునిగా అదిపోల్చబడింది (7:9); దేవుని యందు నమ్మిక లేని *పిరికి గుండెగల గువ్వగా* (7:11); *అక్కరకు రాని విల్లువలె* (7:16); మరియు *స్వార్థపూరిత విస్తార ద్రాక్షవనం వలె* (10:1) పోల్చబడింది. ఈ గ్రంథంలోని మరిన్ని అలంకారాలు ఇలా ఉన్నాయి:

*ప్రవక్త మరియు యాజకుడు.* దేశము ప్రవక్త (9:8) మరియు యాజకునితో (4:6) పోల్చబడింది.

*అభ్యాసము గల పెయ్య.* ఇశ్రాయేలు దేశం మొండి పెయ్యగా మాత్రమే గాక అభ్యాసము గల పెయ్యగానూ పోల్చబడింది (10:11).

*వేకువ జాము మేఘము, మరియు ప్రాఃతకాలముపు మంచు, పొగ.* ఇశ్రాయేలు భక్తి తెల్లవారగానే కనబడు మేఘము ఎగిరి పోవునట్లు, ప్రాఃత కాలమున పడు మంచు ఆరిపోవునట్లు ఉండునని వ్రాయబడింది (6:4బి). మరో మాటలో చెప్పాలంటే వారి భక్తి తాత్కలికమైనది. అది శాశ్వతం కాదు.

*ఉదయపు మేఘము, మంచు, పొట్టు పొగ.* ఇశ్రాయేలు "ఉదయపు మేఘముతోను," "ప్రాఃతకాలపు మంచుతోను," "గాలి ఎగురగొట్టు పొట్టుతోనూ," కిటికిలోగుండా "పోవు పొగ తోనూ" పోల్చబడింది. (13:1–3). ఇశ్రాయేలు ఎక్కువకాలం ఉండదని ప్రవక్త చెప్తున్నాడు.

*కాలుతున్న పొయ్యి.* ఇశ్రాయేలు నాయకులు కాలుతున్న పొయ్యివంటివారు. బలము, కోపము, కామాతురత చేత నిండియున్నారు (7:4–7).

ఇష్టము కాని ఘటము. ఇశ్రాయేలు "ఎవరికీ ఇష్టములేని ఘటము," లేదా ఎవరికీ అవసరం లేని పాత్ర వంటిది (8:8).

*అడవి గార్దబము.* ఇశ్రాయేలు "ఒంటరియైన అడవిగాడిద" వంటిది. అనగా ఇశ్రాయేలు అష్షూరు వంటి దేశాలతో సంధి కోసం యత్నించి విఫలమైనది (8:9, 10).

*ద్రాక్ష మరియు అంజూరము.* ఇశ్రాయేలు అడవిలో దొరకు ద్రాక్షపండ్లు మరియు అంజూరపు తొలిఫలముతో పోల్చబడింది (9:10). ఇది దేవునితో ఇశ్రాయేలు యొక్క మొదటి సంబంధాన్ని సూచిస్తుంది.

*నీటి మీద నురుగువలె.* ఇశ్రాయేలు ("సమరయ") "నీటి మీద నురుగువలె" (10:7) అనునది కత్తిరించి వేయబడిన తరువాత అది వేరు లేనిదగునని సూచించుచున్నది.

*తామరపువ్వు.* దేవుడు ఇశ్రాయేలును ఆశీర్వాదించినప్పుడు అది "తామరపుష్పము వలె అభివృద్ధి నొందుతుంది" (14:5).

*లెబానోను పర్వతము.* దేవుని ఆశిర్వాదము తిరిగి ఇశ్రాయేలు మీదికి తిరిగి వచ్చినప్పుడు వారు "లెబానోను పర్వతము దాని వేళ్ళు తన్నునట్లు" వారు తమ వేళ్ళు తన్నుదురు (14:5, 6), ఇశ్రాయేలు స్థిరంగా యుంటుందన్న విషయాన్ని ఇది సూచిస్తుంది.

ఇశ్రాయేలు పట్ల దేవుని ప్రతిస్పందనను తెలియజేయుటకు హోషేయ అలంకార భాషను వాడుతున్నాడు. ఈ అలంకారాలు దేవుడు మరియు ఇశ్రాయేలు మధ్య సంబంధాన్ని తెలియజేస్తున్నాయి. ఉదహారణకు ఇశ్రాయేలు భార్యయైతే, దేవుడు *భర్తగా* చెప్పబడ్డాడు. ఇశ్రాయేలు కుమారుడు అయితే, దేవుడు *తండ్రిగా* చెప్పబడ్డాడు. దేవుడు ఇశ్రాయేలు పట్ల జరిగిన దాన్ని లేదా చేయబోవు దాన్ని తెలియజేయుటకు హెచ్చరిక మాటలు వాడబడ్డాయి. దేవుడు తన ప్రజల పట్ల ఇయ్యబోవు ఆశీర్వాదాలను తెలియజేయు ఆదరణ వాక్కులు కూడ ఇయ్యబడ్డాయి.

చిమ్మట, *వత్సపురుగులు.* "ఎఫ్రాయిమీయులకు చిమ్మట పురుగువలెను, యూదా వారికి వత్స పురుగు వలెను నేనుందును" (5:12).

*కొదమసింహం.* "ఎఫ్రాయిమీయులకు సింహం వంటి వాడనుగాను, యూదా వారికి కొదమసింహం వంటి వాడనుగాను నేనుందును, నేను వారిని పట్టుకొని చీల్చెదను" (5:14).

*సింహం, చిరుతపులి, ఎలుగుబంటి, ఆడుసింహము, దుష్టమృగములు.* దేవుడు ఇశ్రాయేలును శిక్షించునప్పుడు ఈ మృగాల వంటివాడై వారిని చీల్చి వేస్తాడని ఆయన తెలియజేస్తున్నాడు (13:7, 8).

*వర్షం.* దేవుడు ఇశ్రాయేలును ఆశీర్వదించునప్పుడు వర్షం వలె ఉంటాడని తెలియజేస్తున్నాడు (6:3; చూడండి 10:12).

*సింహము.* ఇశ్రాయేలు విమోచింపబడునప్పుడు ఆయన సింహంవలె

గర్జిస్తాడు" (11:10).

*మంచు.* "చెట్టుకు మంచు ఉన్నట్లె నేనతనికి ఉందును, తామరపుష్పము పెరుగునట్లు అతడు అభివృద్ధి నొందును" (14:5).

*సరళవృక్షం.* "నేను చిగురు పెట్టు సరళ వృక్షము వంటి వాడను. నావలననే నీకు ఫలము కలుగును" (14:8).

**చారిత్రక వచన వివరాలు**

హోషేయ అంతకు ముందటి చారిత్రక విషయాలను తన వాక్యంలో ఉదహరిస్తున్నాడు. అందులో కొన్ని ఇవి:

1:4–యెజ్రెయేలులో యెహూ ఇంటివారు చేసిన అహాబు యొక్క రక్తపాతము (2 రాజులు 9; 10).

2:15–ఆకోరు లోయలో ఆకాను చేసిన పాపం (యెహోషువా 7:24–26).

2:15; 8:13; 9:3, 10; 11:1; 12:9, 13; 13:4, 5–ఇశ్రాయేలు ఐగుప్తులో బంధీగా నుండడం, విమోచన మరియు వారి అరణ్యానుభవాలు.

4:15; 10:5–బేతేలులోని దూడ విగ్రహం "బేతావెను" సూచించుచున్నది; "దూడను" (బేతావెను, "Beth-aven"; 1 రాజులు 12:28, 29).

6:7–ఆదాము యొక్క పాపం (ఆదికాండము 3).

8:5, 6–యరొబాము స్థాపించిన విగ్రహాలు ("దూడ"**;** 1 రాజులు 12:28, 29).

9:9; 10:9–గిబ్యాలో లేవీయుని ఉపపత్ని బలవంతం చేయబడడం (న్యాయాధిపతులు 19).

9:10–బయెల్పెయోరులో ఇశ్రాయేలు పాపం (సంఖ్యాకాండము 25).

11:8–సొదొమ, గొమొర్రాలతో వాటి నాశనం చేయబడిన "అద్మాను" మరియు "జెబోయిము" పట్టణాలు (ద్వితీయోపదేశకాండము 29:23).

12:3, 4, 12–యాకోబు జీవితంలోని సంఘటనలు: అతడి జననం (ఆదికాండము 25), దేవదూతతో పోరాటం (ఆదికాండము 32) బేతేలు వద్ద దేవుని అనుభవం (ఆదికాండము 28; 35), ఆరామునకు పారిపోవడం (ఆదికాండము 28), భార్య నిమిత్తం మామ ఇంటిలో కాపరిగా కొలువుచేయడం (ఆదికాండము 29).

13:10, 11–ఇశ్రాయేలు రాజు కోసం అడగడం (1 సమూయేలు 8).

**హోషేయ గ్రంథంలో "దేవుని గూర్చిన జ్ఞానము" ప్రధానంగా చెప్పబడడం**

దేవున్ని ఎరిగియుండడం లేదా దేవుని గూర్చిన జ్ఞాన్నాన్ని కలిగియుండడం గురించి హోషేయ తన గ్రంథంలో ప్రధానంగా చెప్పాడు. మొదటినుండి ఇశ్రాయేలుకు యెహోవా దేవుడు తప్ప మరే దేవత తెలియదు (13:4). ఎందుకు! ఎందుకంటే ఆయన ఇశ్రాయేలును అరణ్యములో సంరక్షించిన వాడు (13:5).

హోషేయ యొక్క కాలంలో ఇశ్రాయేలు యొక్క సమస్య దేవున్ని ఎరిగియుండక పోవడం:

"దేశంలో దేవుని గూర్చిన జ్ఞానం లేదు" (4:1); వారు విగ్రహాలను పూజించారు ("వ్యభిచార మనస్సు"; 4:12; 5:4), కనుక వారు ఆయనను ఎరుగలేదు (5:4).[3] వారు దేవున్ని ఎరిగాను అని చెప్తున్నప్పుడు (8:2) వారు అబద్ధమాడినందున దేవునిచేత తిరస్కరించబడ్డారు. దాని ఫలితంగా వారికి జ్ఞానం లేకపోవుట చేత వారు నశింప చేయబడ్డారు. వారు జ్ఞానాన్ని తృణీకరించారు కాబట్టి వారి అజ్ఞానాన్ని బట్టి వారింక ఎవరినీ నిందించలేరు. కాబట్టి దేవుడు వారిని తిరస్కరించాడు (4:6). "బలులు మరియు దహన బలులు" "భక్తి" మరియు "దేవుని గూర్చిన జ్ఞానమునకు" ప్రత్యామ్నాయంగా ఉంటాయని వారు అనుకున్నారు (6:6). వారు తప్పుగా ఆలోచించారు.

అయితే, సమయం వచ్చినప్పుడు ఇశ్రాయేలు శిక్షించబడినప్పుడు తరువాత దేవుడామెను "ప్రధానం" చేసుకొంటాడు – ఆమెను మరలా వివాహమాడుతాడు – సమయం వచ్చినప్పుడు, ఇశ్రాయేలు మరలా ఆయనను తెలుసుకుంది (2:20).

ఈ మధ్య కాలంలో, వారు చేయాల్సిన పని 6:3లోని హోషేయ యొక్క వినతిని అనుసరించడం: "యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించుకొందము రండి."

హోషేయ చెప్పిన "యెహోవాను గూర్చిన జ్ఞానము" అంటే అది కేవలం తెలుసుకోవడమే కాదు. ఆయన పట్ల, ఆయన వాక్యం పట్ల నమ్మకంగా యుండి దేవున్ని అనుభవించి తెలుసుకోవడం.

---

సూచనలు

[1]హోషేయ యొక్క జీవిత కాలంలో ఇతర రాజులు పాలించినా వారి పేర్లు ఇయ్యబడలేదు. అతని ప్రవచనా పరిచర్య క్రీ.పూ. 760 నుండి 720 మధ్య సాగింది. [2]హోషేయ కథ సాదృశ్యంగానే ఇయ్యబడిందన్న విషయానికి విరుద్ధంగా ఇయ్యబడిన వ్యాఖ్యాలు ఈ గ్రంథంలో కనబడతాయి. Paul. T. Butler, *The Minor Prophets: The Prophets of the Decline - Obadiah, Joel, Jonah, Amos, Hosea,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1968), 428-29. [3]ఇతర వచనాలు "జ్ఞానం" లేదా "ఎరిగియుండడం" గురించి చెప్పవు గాని అదే అక్షరంలో చెప్తాయి (4:10: "వారు యెహోవాను లక్ష్యపెట్టుట మానిరి"; 4:11: "వ్యభిచార క్రియలు, ద్రాక్షరసము, మధ్యపానము"; మరియు 4:14: "వివేచన లేని జనము నిర్మూలమగును").

## సంక్షిప్త వర్ణన

హోషేయ గ్రంథము సంక్షిప్త వర్ణనకు కష్టకరమైనది, ఇక్కడ క్లుప్త విభజన ఇవ్వబడింది:

1–3 అధ్యాయం: హోషేయ మరియు గోమెరుల సంబంధాన్ని ఉపయోగించి తనకూ ఇశ్రాయేలునకూ మధ్య సంబంధాన్ని తెలియజేస్తున్నాడు.
4–13 అధ్యాయం: ఇశ్రాయేలు పాపం చేసింది (అపనమ్మకం), ఆ పాపలను బట్టి పశ్చాత్తాపపడకపోతే, దేవుడు ఆమెను శిక్షిస్తాడు.
14వ అధ్యాయం: దేవుడు తన ప్రజలను పునరుద్ధరిస్తాడని వాగ్దానం చేశాడు.

ఈ అధ్యాయన నిమిత్తం మరింత వివరంగా విభజనను చూద్దాము:

I. హోషేయ వ్యభిచారియైన గోమెరును వివాహమాడిన సాదృశ్యంగా దేవుడు వ్యభిచారంలోనున్న తన ప్రజలను చేరదీశాడు (1:1–3:5)
   A. "వ్యభిచారినిని వివాహమాడమని" దేవుడు హోషేయకు ఆజ్ఞాపించడం (1:1–11)
   B. ఇశ్రాయేలు పశ్చత్తాపపడేలా దేవుడు పని చేయడం (2:1–23)
   C. హోషేయను వ్యభిచారియగు గోమెరు రెండవ మారు వివాహమాడి ప్రేమించమన్నట్లు దేవుడు ఇశ్రాయేలును బ్రతిమాలడం (3:1–3)
   D. ఇశ్రాయేలు యొక్క భవిష్యత్తు (3:4, 5)

II. ప్రజల పాపాలు మరియు దేవుని ఖండన (4:1–7:16)
   A. దేశపు పాపాలను బట్టి దేవుడు ఖండించడం (4:1–19)
      1. అమానవీయ పాపాలు (4:1–3)
      2. అపవిత్రమైన యాజకులు మరియు అజ్ఞానం (4:4–10)
      3. విగ్రహారాధన (4:11–19)
   B. ఇశ్రాయేలు మరియు యూదా లోనున్న అవినీతిని దేవుడు ఖండించడం. వారి తీర్పు (5:1–6:11ఎ)
   C. నిబంధనను పునరుద్ధరించాలన్న దేవుని ఆశ మరియు ప్రజల విశ్వాసఘాతకం (6:11బి–7:16)

III. దేవుని తీర్పు (8:1–10:15)
   A. శిక్షను ప్రకటించడం: ఇ అవిశ్వాస ఇశ్రాయేలు నాశనమనే వంటను కోయబోతుంది (8:1–14)
   B. వారి శిక్షను వివరించడం (9:1–10:15)
      1. చెరలో నుండే దుఃఖం మరియు ఒంటరి తనం (9:1–9)
      2. నిబంధనా విధులను అతిక్రమించడంవలన అపరాధం (9:10–17)
      3. మరింత నమ్మకద్రోహం; రాజు మరియు అతడి రాజ్యంపై త్వరిత తీర్పు (10:1–15)

IV. దేవుని ప్రతిస్పందన (11:1–13:16)
   A. విశ్వాసఘాత దేశానికి దేవుడిచ్చు నిబంధన మరియు సమర్పణ (11:1-12:1)
   B. దేశం మరియు వారి పితరుడైన యాకోబు (12:2–6)
   C. ఇశ్రాయేలు తిరుగుబాటుతనాన్ని చూపించడం (12:7–14)
   D. ఇశ్రాయేలు వినాశనం: పాపం మరియు విశ్వాసఘాతం అను పాపాల ద్వారా నాశనం (13:1–16)

V. పునరుద్ధరణ నిమిత్తమైన దేవుని వాగ్దానం (14:1–9)
   A. పశ్చాత్తాపపడేందుకు దేవుడు పిలవడం (14:1–3)
   B. పశ్చాత్తాపడడం వలన రితిగే బహుమానాలు (14:4–7)
   C. పశ్చాత్తాపపడేందుకు రెండు కారణాలు (14:8, 9)
      1. దేవుని స్వభావమును బట్టి (14:8)
      2. విధేయతా జ్ఞానం బట్టి (14:9)